RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక :86 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | శుక్రవారం 27-02-2026 | పేజీలు -6 | వెలః రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

## భారతీయ విద్యాభవన్ తరహాలో

# స్కూళ్లు

**మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్**


- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు
- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్ ఫిబ్రవరి 26 అక్షర వేదం

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు

-మిగతా 2 లో





## సెమీస్ రేసులో

# టీమిండియా..!

**పాండ్యా, అభిషేక్ మెరుపులు..**

- భారత్ చేతిలో జింబాబ్వే 72 పరుగుల తేడాతో ఓటమి
- టీ20 ప్రపంచకప్ 2026 సెమీస్‌కు అడుగుదూరంలో భారత్..!
- టీ20 ప్రపంచకప్ 2026 నుంచి జింబాబ్వే ఔట్

న్యూఢిల్లీ,

టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో టీమిండియా బోణీ కొట్టింది. గురువారం చెన్నైలోని ఎంఏ చిదంబరం క్రికెట్ స్టేడియంలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు స్కోరు చేసింది. అనంతరం జింబాబ్వేను 184/6 పరుగులకే పరిమితం చేసింది. ఈ ఫలితంతో సెమీస్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.257 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే.. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. కానీ ఆ జట్టు ఓపెనర్ బెన్నెట్ మాత్రం చివరి వరకూ పోరాడాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. అతడు మాత్రం నిలబడ్డాడు. చివరకు 59 బంతుల్లో 97 రన్స్ చేసి.. నాటౌట్‌గా నిలిచాడు. అయితే అతడి పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. 72 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

-మిగతా 2 లో



## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం

# చిమ్ముతున్న బీఆర్ఎస్

- కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే నిర్మాణం
- సీబీఐ విచారణ కోరినా పట్టించుకోని బీజేపీ
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఫిబ్రవరి 26 అక్షర వేదం

తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం


-మిగతా 2 లో

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



2 లో



## బికినీ దుస్తుల్లోని అమ్మాయిలతో

# స్టీఫెన్ హాకింగ్..

- ఎప్‌స్టీన్ ఫైల్స్ ఫోటోల్లో ఖగోళశాస్త్రవేత్త
- బికినీ ధరించిన ఇద్దరు అమ్మాయిలతో ఉన్న ఫోటోను తాజాగా రిలీజ్
- సెక్స్ అఫెండర్ ఎప్‌స్టీన్‌కు చెందిన ఫైల్స్‌లో హాకింగ్ ఫోటో ఉండడం గమనార్హం.

వాషింగ్టన్

మోటార్ న్యూరాన్ వ్యాధితో బాధపడుతూ.. వీల్ చైర్ నుంచే విశ్వరహస్యాలను ఛేధించిన స్టీఫెన్ హాకింగ్ కూడా జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు చిక్కారు. బ్రిటీష్ ఖగోళ శాస్త్రవేత్త హాకింగ్.. బికినీ ధరించిన ఇద్దరు అమ్మాయిలతో ఉన్న ఫోటోను తాజాగా రిలీజ్ చేశారు. ఆ ఫోటోను ఎప్‌స్టీన్ ఫైల్స్ నుంచి బయటకు తీసినట్లు తెలిసింది. సెయింట్ థామస్‌లోని రిట్జ్ కార్ల్‌టన్ హోటల్‌లో జరిగిన సైన్స్ సదస్సు సమయంలో 2006లో ఆ ఫోటో తీసినట్లు అంచనా వేస్తున్నారు. సూర్యరశ్మి కోసం సేదతీరే కుర్చీపై వాలిన హాకింగ్ చేతిలో కాక్‌టెయిల్ ఉన్నది. హాకింగ్ దగ్గర అటూ ఇటూ నిలుచున్న ఇద్దరు అమ్మాయిలు బికిని దుస్తుల్లో ఉన్నారు. ఆ ఇద్దరు కూడా కాక్‌టెయిల్ పట్టుకున్నారు.అమెరికా ఫైనాన్షియర్, సెక్స్ అఫెండర్ ఎప్‌స్టీన్‌కు చెందిన ఫైల్స్‌లో హాకింగ్ ఫోటో ఉండడం గమనార్హం. అయితే ఆ ఫైల్స్‌లో సైంటిస్ట్ హాకింగ్‌కు చెందిన చాలా ఫోటోలు ఉన్నట్లు తెలుస్తోంది. సెయింట్ జేమ్స్ దీవిలో ఉన్న ఎప్‌స్టీన్ రిసార్టును విజిట్ చేసిన 21 మంది శాస్త్రవేత్తల్లో హాకింగ్ కూడా ఒకరు. బ్లాక్ హోల్స్ రహస్యాన్ని విప్పిన హాకింగ్‌కు చెందిన 250 ఫోటోలు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నట్లు తెలిసింది. 76 ఏళ్ల వయసులో హాకింగ్ 2018లో మరణించారు. 2006లో ఎప్‌స్టీన్ ఫండింగ్ చేసి నిర్వహించిన ఓ కాన్ఫరెన్స్‌లో హాకింగ్ పాల్గొన్నట్లు తెలిసింది.

-మిగతా 2 లో

## తెలంగాణలో భారీగా

# ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం




హైదరాబాద్, ఫిబ్రవరి 26 అక్షర వేదం

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

-మిగతా 2 లో

## ఇజ్రాయెల్-భారత్ మధ్య


# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**ఇకపై ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు :**

- ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన
- త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 అక్షర వేదం

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర



రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు

-మిగతా 2 లో

## తెలంగాణలో

# దుర్మార్గమైన ప్రభుత్వం

**పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు**

- ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
- అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం
- కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్

ఖమ్మం ఫిబ్రవరి 26 అక్షర వేదం

తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు.

-మిగతా 2 లో





## ది కేరళ స్టోరీ

# విడుదలకు బ్రేక్

- సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు
- 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ సెన్సార్ బోర్డును తప్పపట్టిన హైకోర్టు




తిరువనంతపురం,

సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి

-మిగతా 2 లో

## మీరు వెళ్తారా?

# నన్నే వెళ్లమంటారా?


- అధికారులకు చంద్రబాబు అల్టిమేటమ్
- శ్రీకాకుళం నగరంలో ప్రబలిన డయోరియా
- రాజమండ్రి పాలకల్తీ ఘటనలో ఆరుగురు మృతి
- సమీక్షలో అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



2 లో

# తెలంగాణలో మరోసారి భూప్రకంపనలు..

- మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో కంపించిన భూమి..
- రిక్టర్ స్కేల్‌పై 3.9 తీవ్రత



హైదరాబాద్,

తెలంగాణలో ఇటీవల హైదరాబాద్‌లో ఉదయం భూ ప్రకంపనలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. గాజులరామారంలో భూమి కంపించినట్లు స్థానికులు వెల్లడించారు. భూమి కంపించడంతోపాటు భారీ శబ్దం వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి రాష్ట్రంలో భూకంపం రావడం తీవ్ర కలకలం రేపుతోంది. మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం అర్ధరాత్రి భూమి కంపించినట్లు స్థానికులు వెల్లడించారు. అయితే ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.9గా నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంప కేంద్రం మంచిర్యాల జిల్లాకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దుల్లోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడింటారు. మరోవైపు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో 3 సెకన్ల పాటు భూమి కంపించినట్లు పేర్కొన్నారు. ఈ భూకంప తీవ్రతకు ఇళ్లల్లో ఉన్న వస్తువులు ఒక్కసారిగా కిందపడ్డాయని వివరించారు.ఇక అర్ధరాత్రి పూట భూమి కంపించడంతో..

-మిగతా 2 లో

## సెమీస్ రేసులో టీమిండియా..!

మొదటి తరువాయి

సూపర్-8లో వరుసగా రెండో మ్యాచులో ఓడిపోయిన జింబాబ్వే.. టోర్నీ సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. లీగ్ స్టేజ్‌లో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి.. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించిన జింబాబ్వే.. సూపర్-8లో మాత్రం తేలిపోయింది. వెస్టిండీస్, భారత్ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే.. టోర్నీ సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. భారీ స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (55), హార్దిక్ పాండ్యా (50). తిలక్ వర్మ (44), ఇషాన్ కిషన్ (38) మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. దీంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో తమ అత్యధిక స్కోరు రికార్డు బ్రేక్ చేసింది. 2007 టీ20 ప్రపంచకప్‌లో భారత్.. ఇంగ్లాండ్‌పై 218/4 స్కోరు చేసింది. ఆ మ్యాచులో యువరాజ్ సింగ్.. స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు కొట్టాడు. తాజా విజయంతో భారత్.. సెమీఫైనల్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. మార్చి 1న వెస్టిండీస్‌తో జరిగే మ్యాచులో టీమిండియా విజయం సాధిస్తే.. నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

## బికినీ దుస్తుల్లోని అమ్మాయిలతో స్టీఫెన్ హాకింగ్..

మొదటి తరువాయి

కరీబియన్ దీవుల్లోని సెయింట్ థామస్‌లో హాకింగ్ పర్యటించిన ఫోటోలు ఉన్నా.. ఇప్పటి వరకు మాత్రం నేరుగా ఎప్‌స్టీన్‌తో దిగిన ఫోటో ఒక్కటి కూడా రిలీజ్ లేదు. హాకింగ్‌తో ఉన్న ఆ ఇద్దరు అమ్మాయిలు.. ఆయనకు సేవ చేసేవారని తెలిసింది. ఓ సందర్భంలో హాకింగ్ జలాంతర్గామిలో ప్రయాణించినట్లు కూడా ఫోటో ఉన్నది. అండర్‌వాటర్ వెసల్‌ను హాకింగ్ కోసం ఎప్‌స్టీన్ మార్పులు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రిలీజైన ఫోటోపై హాకింగ్ ఫ్యామిలీ రియాక్ట్ అయ్యింది. ఖగోళ శాస్త్రవేత్త హాకింగ్ పట్ల అనుచితంగా వ్యవహరించడం సరికాదు అని ఫ్యామిలీ పేర్కొన్నది.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

మొదటి తరువాయి

కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

## తెలంగాణలో మరోసారి భూప్రకంపనలు..

మొదటి తరువాయి

అప్పటివరకు గాఢ నిద్రలోకి జారుకున్న ప్రజలు ఒక్కసారిగా లేచి బయటికి పరుగులు తీశారు. గతంలో తమకు ఎప్పుడూ ఇలాంటి భూకంపం అనుభవం ఎదురుకాలేదని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ భూకంప తీవ్రతకు సంబంధించిన సీసీటీవీ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు.. కొన్ని నెలల క్రితం కూడా మంచిర్యాల, ఆదిలాబాద్, కరీంనగర్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అప్పుడు ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన వద్ద భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు.


## ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

మొదటి తరువాయి

సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదిరించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.

## మీరు వెళ్తారా? నన్నే వెళ్లమంటారా?

- అధికారులకు చంద్రబాబు అల్టిమేటమ్
- శ్రీకాకుళం నగరంలో ప్రబలిన డయోరియా
- రాజమండ్రి పాలకల్తీ ఘటనలో ఆరుగురు మృతి
- సమీక్షలో అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



శ్రీకాకుళం

అధికారులు తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో డయేరియా, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పాలకల్తీ ఘటనలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆకస్మిక తనిఖీలకు మీరు వెళ్తారా? నేను మొదలు పెట్టాలా?'అని వ్యాఖ్యానించారు. ఆఫీసుల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు."క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి మాట్లాడితే సమస్యలు తెలుస్తాయి. మీరు వెళ్లకుంటే నేను వెళ్లడం మొదలుపెడతా" అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో కల్తీ పాల ఘటనలో ఇప్పటి వరకూ ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. వీరికి చికిత్స కోసం ముంబయి నుంచి ఔషధాలను తెప్పించినట్టు పేర్కొన్నారు.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటి తరువాయి



పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

### వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



న్యూయార్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది . ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

మొదటి తరువాయి

అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఇూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటి తరువాయి

ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

మొదటి తరువాయి

అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ట బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్ళెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరఫున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం.

# ఖనిలో జాతీయస్థాయి కళోత్సవాలు...

**-మార్చి 28, 29 తేదీలలో నృత్య పోటీలు.. బహుమతులు...**
**-విభిన్న రంగాలలో సేవకులను గుర్తించి నల్లవజ్రం అవార్డులు అందజేస్తాం.. సంకె రాజేష్**



**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి26**
తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖనిలో రెండు రోజులపాటు జాతీయస్థాయి నృత్య పోటీలు, ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డుల వేడుకలు నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, ఇప్టా జాతీయ సమితి నాయకులు కే.స్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఉత్తరాఖండ్, తమిళనాడు, అండమాన్ నికోబార్, అమెరికా, మలేషియా, సింగపూర్, స్విట్జర్లాండ్, తైవాన్ తదితర దేశాలలో సైతం కళోత్సవాలు నిర్వహించి, వివిధ రంగాలలో ప్రతిష్టులైన వారిని గుర్తించి సముచిత రీతిన సత్కరించడం జరిగిందన్నారు. గోదావరిఖని కేంద్రంగా 2021లో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్, 2024లో విభిన్న రంగాలలో రాణిస్తున్న సుమారు 125 మంది సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల పిల్లలను గుర్తించి, నల్ల వజ్రం జాతీయ పురస్కారాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖని ఆర్కే గార్డెన్స్ లో ఉగాది ఉత్సవాలు, జాతీయస్థాయి జానపద, శాస్త్రీయ బృంద నృత్యాల పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్యం, పాత్రికేయ, న్యాయవాద, ఉపాధ్యాయ, ఉద్యోగులు, అధికారులు తదితర రంగాలలో రాణిస్తున్న వారిని గుర్తించి ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ, టీవీ నటీనటులను అతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నృత్య పోటీలలో పాల్గొనదలచిన కళాకారులు మార్చి 10లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6281252369 నెంబర్ లో సంప్రదించాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో కళోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, కనకం రమణయ్య, పి.చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడు తిరుపతి ఆశయాలను కొనసాగిద్దాం: సిపిఐ

**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి26**
ప్రజా ఉద్యమ నాయకుడు మాజీ కౌన్సిలర్ తన ఇంటి పేరుని సిపిఐ గా మార్చుకొని అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన మార్కపురి తిరుపతి 10వ వర్ధంతి సభ గోదావరిఖని ఎల్ బి నగర్ లోని సీపీఐ జెండా వద్ద శాఖ కార్యదర్శి మార్కపురి సూర్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు హాజరై సిపిఐ తిరుపతి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమ నాయకుడు నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీ పక్షాన మొదటిసారి కౌన్సిలర్ గా ఎన్నికై ప్రజావాణిని కౌన్సిల్ లో విన్పించిన వ్యక్తి అని అనేక ప్రజా సమస్యలకు పోరాటాల ద్వారా పరిష్కారం చూపిన వ్యక్తి సిపిఐ తిరుపతి అని కొనియాడారు. తన పేరు మార్కపూరి తిరుపతి అయినప్పటికీ తను చేసినటువంటి పోరాటాలతో పార్టీలో పనిచేసిన నిబద్ధతతో సిపిఐ తన ఇంటి పేరుగా మారి సిపిఐ తిరుపతిగా పేరెన్నిక పొంది రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ప్రజా ఉద్యమాల ద్వారా పొందారని వారన్నారు.



ఎల్బీనగర్ లో నిర్మించబోయే సిపిఐ తిరుపతి స్మారక భవన్ ఆ ప్రాంతంలో ప్రజలకు అండగా ఉద్యమాలకు నిలయంగా మారాలని వారు ఆకాంక్షించారు. ఎల్బీనగర్ లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి ప్రజా ఉద్యమాలకు పరిష్కారం చూపించడానికి సిపిఐ తిరుపతి భవన్ ఒక నిలయంగా మారాలని దానికి పార్టీ కార్యకర్తలతో పాటు శ్రేయోభిలాషులు సానుభూతిపరులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 41వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా గెలిచిన సూర్య తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచాడని అన్నారు. సిపిఐ నీ గెలిపించిన 41వ డివిజన్ ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు రేణిగుంట్ల ప్రీతం, తోడుపునూరి రమేష్ , ఏం.ఏ .గౌస్, ఆరేపల్లి మానస్ కుమార్ పడాల కనకరాజు, జీదుల లక్ష్మీ నారాయణ, రాణవేణి సుదీర్ ఆసాల నవీన్, తాళ్ళపెల్లి సురేందర్, దుబాసీ రేణుక, సాదుల శివ, మార్కాపురి భగత్, తిలక్, జగన్ , రొంటాల లింగయ్య , తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ పోటీలలో రజత పతకం సాధించిన జయ సాయి చరణ్

**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి26**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ పోటీలలో టింగు జయ సాయి చరణ్ రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించారు. గోదావరిఖని పట్టణానికి చెందిన టింగు జయ సాయి చరణ్ 8వ తరగతి చదువుతూ.. డ్రాగన్ షాటొకాన్ కరాటే క్లబ్ మాస్టర్ పసునూటి చందు వద్ద కరాటే లో శిక్షణ తీసుకుంటున్నాడు. హైదరాబాదులోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో 33 జిల్లాల నుండి 15సంవత్సరాల విభాగం, 52 వెయిట్ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో రజత పతకాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రంలో మూడో స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయి లో పేరు నిలబెట్టారు. కరాటే పోటీలలో అనేక అవార్డులు గోల్డ్ మెడల్ సాధించిన టింగు జయ సాయి చరణ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం





కప్ పోటీలలో రాష్ట్రస్థాయిలో రజత పతకం గెలుపొందడం పట్ల కరాటే మాస్టర్లు పసునూటి చందు,



సుంకే రాజు, శ్రీనివాస్ లు తల్లిదండ్రులు పలువురు అభినందించారు.

# నేల ఆరోగ్యాన్ని, దిగుబడులను కాపాడుకోవాలి


**-అక్రమ పత్తి విత్తనాలను వాడవద్దని రైతులకు పరిశ్రమ నిపుణుల విజ్ఞప్తి**




**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (అక్షర వేదం) :**
అన్ రెగ్యులేటెడ్ ఛానెల్ల ద్వారా విక్రయిస్తున్న అక్రమ హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ(హెచ్.టీ.బీ.టీ) పత్తి విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు, విత్తన పరిశ్రమ ప్రతినిధులు పత్తి రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా రాశి సీడ్స్ ఛైర్మన్ డాక్టర్ ఎం.రామసామి మాట్లాడుతూ అనధికారిక ఈ విత్తనాలకు మొలకలు వస్తాయనే హామీ, శాస్త్రీయ ధృవీకరణ ఉండదని అన్నారు. దీనివల్ల తరచు సాగుదారులు అస్థిరమైన పంట దిగుబడిని, ఊహించని ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ ఎన్.కె.రాజవేలు మాట్లాడుతూ కేవలం కలుపు మందులపైనే ఆధారపడకుండా, సమగ్ర కలుపు యాజమాన్యాన్ని(ఇంటిగ్రేటెడ్ వీడ్ మానేజ్మెంట్) పాటించడం వల్ల స్థిరమైన దిగుబడులు రావడమే కాకుండా, కాలక్రమేణా నేల ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందని పేర్కొన్నారు. అక్రమ హెచ్.టీ.బీ.టీ పత్తి విత్తనాలు వేగంగా విస్తరిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అదుపులేని ఈ సీడ్స్ విస్తరణ వల్ల దిగుబడులు తగ్గి, పీచు నాణ్యత దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. తెలియని వ్యక్తుల నుండి కాకుండా, కేవలం రిజిస్టర్డ్, లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు.

# మాకో రోబోటిక్ సిస్టమ్‌తో కేర్ శస్త్ర చికిత్సలు

**-250 మోకాలు-హిప్ మార్పిడి పూర్తి చేసిన కేర్ హాస్పిటల్స్**




**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (అక్షర వేదం) :**
కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ అత్యాధునిక మాకో రోబోటిక్–అసిస్టెడ్ సిస్టమ్ సహాయంతో 250 మోకాలు, హిప్ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిందని కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఆర్థోపెడిక్స్ సీనియర్ కన్సల్టెంట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ గొట్టెముక్కల అశోక్ రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థోపెడిక్స్ సీనియర్ కన్సల్టెంట్స్ డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ వాసుదేవ జువ్వాడి లతోకలసి అయన మాట్లాడుతూ 250 రోబోటిక్ మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేయడం మా అనుభవం, విశ్వాసానికి నిదర్శనం అన్నారు. కొల్లూరుకు చెందిన 70 ఏళ్ల విన్జమూరి వి.ఎస్.ఎస్.శర్మ రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారని తెలిపారు. సిద్ధిపేటకు చెందిన 65 ఏళ్ల ఎం.ఆర్.జి.రఘునాథం కూడా రెండు మోకాళ్ల మార్పిడి చేయించుకున్నారని తెలిపారు. బిహెచ్ఈఎల్‌కు చెందిన 57 ఏళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇంటి పనులు చేయడమే కష్టమయ్యేదని, రోబోటిక్ శస్త్రచికిత్స తర్వాత త్వరగా కోలుకున్నట్లు తెలిపారు. క్లిష్టమైన కేసుల్లో కూడా రోబోటిక్ సహాయం వల్ల అధిక నియంత్రణ, ఖచ్చితత్వం లభిస్తుందన్నారు.

# ఇటిక్యాల ప్రజల నిరీక్షణకు తెర

**రాయికల్ ఫిబ్రవరి 26, అక్షర వేదం**
రాయికల్ మండలంలోని ఇటిక్యాలగ్రామ ప్రజల నిరీక్షణకు తెరపడింది.గత ఏడాది కాలంగా ఇటిక్యాల గ్రామానికి కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోగా మాజీ సర్పంచులు మరిపెల్లి నారాయణ గౌడ్,సామల్ల లావణ్య వేణు,ప్రస్తుత సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల ప్రయాణ ఇబ్బందులను గురించి కోరుట్ల డిపో మేనేజర్ దృష్టిలో తీసుకొని వెళ్లి బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా గురువారం నుండి బస్సు సర్వీస్ సేవలు పునరుద్ధరించారు.నాయకులు చేసిన కృషి వల్ల డిపో మేనేజర్ తీసుకున్న నిర్ణయంతో ఇటిక్యాల గ్రామానికి బస్సు రాకపోకలు తిరిగి ప్రారంభం కావడం వల్ల గ్రామస్తులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.ఈ నూతన సర్వీసు వల్ల విద్యార్థులకు,చిరు వ్యాపారులకు మరియు సామాన్య ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని గ్రామస్తులు తెలిపారు.






## భారాస కార్పొరేటర్లచే ప్రమాణం చేయించిన నగర మేయర్నగర అభివృద్ధికి పాటుపడుదాం

**- మేయర్ మహంకాళి స్వామి.**





**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి26**
పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధికి పాటుపడదామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. బి ఆర్ ఎస్ సభ్యులచే గురువారం మేయర్ ఛాంబర్ లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సశీధర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యలను పరిష్కరిశీచడానికి ప్రతి వార్డు సభ్యుడు పని చేయాలని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నగర అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తున్న తరుణంలో ప్రజల సమస్యలు గుర్తించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిద్దామని అన్నారు. సుమారు 800 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కొనసాగుతున్నదని అన్నారు. కాగా ఈ సంధర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ సభ్యులు ఆకారపు రేఖ (51వ డివిజన్) , కర్క పద్మజ ( 55వ డివిజన్) , తాళ్ల చిన్న రాజయ్య ( 20వ డివిజన్ ) , దారంగుల కుమార్ ( 28వ డివిజన్ ) , నిమ్మరాజుల రజిని ( 29 వ డివిజన్ ) , బదావత్ నర్సమ్మ ( 26వ డివిజన్ ) , బుర్ర శశికళ ( 15వ డివిజన్ ) , మేకల శారద ( 60వ డివిజన్ ) మేకల సమ్మయ్య ( 58వ డివిజన్ ), రమ మందల ( 16వ డివిజన్ ), శ్యామణి ఆవుల ( 6వ డివిజన్ ) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , ఎ సి పి శ్రీహరి , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు


## కూచిరాజ్ పల్లి లో ఇందిరమ్మ సొంత ఇంటి నిర్మాణానికి వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేసిన లబ్ధిదారులు

**- అర్హులైన ప్రతి పేదోడికి సంక్షేమ ఫలాలు అందించి మేలు చేయడమే ప్రజా ప్రభుత్వం కార్యాచరణ**



**అక్షర వేదం//మంథని,ఫిబ్రవరి 26:**
మంథని నియోజకవర్గానికి ఎక్కువ మొత్తంలో అర్హులైన ప్రజలకు అభివృద్ధి,నిధులు,సంక్షేమ ఫలాలు అందించాలని దృఢ సంకల్పంతో తెలంగాణ ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆశీస్సులు,ప్రత్యేకమైన దృష్టితో పేదోడి సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో వారు పని చేస్తున్నారని ఆ కార్యాచరణ భాగంలో మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కూచిరాజుపల్లి లో కామనీ భాగ్య, కొమురయ్య కు నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంథని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి చేతుల మీదుగా గురువారం రోజున నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజా చేశారు.ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ నక్క నాగేంద్ర,శంకర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి సత్తయ్య,కామణి రమేష్,మిట్టపల్లి కిషోర్,మాదేశి పద్మ,అంబటి సాయి తదితరులు పాల్గొన్నారు..

## బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి



**అక్షర వేదం/ వనపర్తి :**
అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్ గ్రామములో నూతనంగా నిర్మించిన ఆలయంలో బాలాజీ వెంకటేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ యాదగిరి గుట్ట తరహాలో కృష్ణ శిలలతో(సిమెంట్,ఇసుక లేకుండా)ఆలయం నిర్మించడం అద్భుతమని నిర్వాహకులను అభినందించారు.మనం నిర్మించే ఆలయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తితో పాటు ఆధ్యాత్మికతకు దోహదం చేస్తాయి అని అన్నారు.
ఆహ్వానితులు సంజీవ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి నిఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్మా.సత్యం,విజయ్ గౌడ్,రాజేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛ రామగుండమే ప్రధాన లక్ష్యం: నగర మేయర్





**- బాధ్యతలు చేపట్టిన నగర మేయర్ మహంకాళి స్వామి.**

**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి26**
స్వచ్ఛ రామగుండంశీగా తీర్చి దిద్దడమే ప్రదాన లక్ష్యమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఎన్నికైన తరువాత తొలిసారిగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేయడానికి అంచనా వ్యయశీ రూ 10.00 లక్షలతో చెత్త డబ్బాలు కొనుగోలు చేయడానికై ప్రవేశపెట్టిన ఫైలుపై తొలి సంతకం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో సానిటేషన్ నిర్వహణలో లోపాలను గుర్తించి ప్రక్షాళన చేయడం జరుగుతుందని అన్నారు.
రామగుండం నగరంలో కొంతమంది తమ స్వస్థలం లో జనాభా వివరాలు నమోదు చేసుకుంటుండడంతో ఇక్కడ డేటా లో వారి వివరాలు ఉండడంలేదని అన్నారు. తద్వారా నిధుల మంజూరులో నివసిస్తున్న జన సంఖ్య ప్రాతిపదికన రామగుండం నగరానికి నిధులు దక్కడం లేదని అన్నారు. ఇక్కడ ఉంటున్న ప్రతి ఒక్కరు జన గణనలో ఇక్కడే నమోదు చేసుకోవాలని అన్నారు. అలాగే 1931తర్వాత తొలిసారిగా జనాభా లెక్కల్లో భాగంగా కుల గణన కూడా జరుగుతున్న నేపధ్యంలో లెక్కలు సరిగా నమోదు అయ్యేలా పర్యవేక్షిస్తామని అన్నారు. అలాగే రామగుండం నగరానికి సానుకూలంగా ఉండేలా కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని అన్నారు. సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించి రాబోయే 20 ఏండ్ల వరకు ఉపయోగపడేలా రూపొందిస్తామని అన్నారు.
అంతేకాకుండా ఇప్పటి వరకు కొనసాగుతున్న 15వ ఆర్థిక సంఘం గడువు ముగిసి ఏప్రిల్ 1, 2026 నుండి 16వ ఆర్థిక సంఘం అమల్లోకి వస్తున్న నేపధ్యంలో రామగుండం నగర పాలక సంస్థ కు ఈ ఐదేళ్ల నిధులు అధికంగా వచ్చేందుకు ఏమి చేయాలో అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా నివేదికలు పంపించడం జరుగుతుందని అన్నారు. సమగ్ర నగరాభివృద్ధి కొరకు ఒక డిపిఆర్ రూపొందిశీచి ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. తనను ఆశీర్వదించిన వారందరికీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కుటుంబ సభ్యులతో కలసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం మేయర్ తన ఛాంబర్ లో పీఠంపై ఆశీనులయ్యారు.

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ...**
పాలక పక్షం , ప్రతిపక్షం అనే తేడా లేకుండా అన్ని డివిజన్లలో అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. మేయర్ గా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లోని ఛాంబర్ లో గురువారం మహంకాళి స్వామి పదవీ భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన సతీ సమేతంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు . ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా , యువజన నాయకుడిగా , కాంగ్రెస్ నాయకుడిగా , కార్పొరేటర్ గా సుదీర్ఘ కాలంగా సేవలందించిన దళిత నాయకుడు మేయర్ గా , కార్మిక నాయకుడు , బి సి నాయకుడు గా ఉన్న సీనియర్ నేత డిప్యూటీ మేయర్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో ఎంపికయ్యారని అన్నారు. బొందల గడ్డగా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న తమ పై ఎంత దుష్ప్రచారం చేసినా సత్యదూరమైన మాటలను ప్రజలు నమ్మకుండా ఇటీవలి ఎన్నికల్లో అద్భుత ఫలితాలు ఇచ్చారని అన్నారు. త్రాగు నీరు , సాగు నీరు , మౌళిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తుండడంతో పాటు , 1 ఆ 800 మెగా వాట్ల థర్మల్ ప్రాజెక్ట్ తదితర పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతి రామగుండం నగరంలో చురుగ్గా సాగుతున్నదని అన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండి నూతన పాలక వర్గశీ పని చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వయంగా విచ్చేసి మేయర్ కు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు , జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , వివిధ ప్రభుత్వ సంస్థలు , విభాగాల అధికారులు , సిబ్బంది, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , పలువురు కార్పొరేటర్లు , ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు , పుర ప్రముఖులు , వివిధ సంఘాల ప్రతినిధులు , ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు , స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు , వివిధ పార్టీల నాయకులతో పాటు డివిజన్ ప్రజలు మేయర్ కు అభినందనలు తెలిపారు.

# ప్రేమ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఘనంగా శ్రీ సంతు సేవాలాల్ 287వ జయంతి ఉత్సవాలు

**అక్షర వేదం/మహాముత్తారం, ఫిబ్రవరి 26:**
మహాముత్తారం మండలంలోని ప్రేమనగర్ గ్రామపంచాయతీ పరిధిలో లంబాడీల ఆరాధ్య దైవం మైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఇట్టి కార్యక్రమంలో లంబాడీల తండా నాయకులు మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ చూపిన మార్గం తను ఆచరింపజేసిన ఆచార వ్యవహారాలు రాబోవు తరాలకు మంచి మార్గం చూపుతోందని, గొప్ప సాంస్కృతి సాంప్రదాయాలను, లంబాడి లే గాక ఇతరులు కూడా ఆచరించవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. పూర్వీకులు ఆచరించిన పద్ధతులు చాలా గొప్పవని భావితరాలకు ఎంతో ఉపయోగపడతాయని టూకీగా కొన్ని ఆచార వ్యవహారాల పుట్టుకను వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు నాయక్ తో పాటు తండా నాయకులు దేశాయ్ నాయక్ ,జాటోత్ రామ్ సింగ్, ఉప సర్పంచ్ జాటోత్ ప్రహ్లాద్, కేవు నాయక్ ,రాజారాం నాయక్ ,జాటోత్పర్తి



నాయక్ వంశీ నాయక్ మోతిలాల్ టాకర్ నాయక్ జాటో దనసింగ్ నాయక్ అమర్ వార్డ్ సభ్యులు చింగ్యానాయక్ నరేష్ జాటోత్ కోటి నాయక్, స్వగ్రామ్, వివిధ గ్రామాల నాయకులు బానోత్ సేవా నాయక్, లావుడియా రాజన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్అలైవ్" రెండో విడతలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు

**రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

**అక్షర వేదం,మంచిర్యాల్, ఫిబ్రవరి 26**
రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తాలో గురువారం "అరైవ్అలైవ్" రెండో విడత కార్యక్రమంలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రతి వాహనదారుడు సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడం ప్రధాన లక్ష్యంగా



ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రాణం కన్నా విలువైనది ఏదీ లేదని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.సురక్షిత ప్రయాణం ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్,ఏసీపీ ప్రకాష్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,సీఐ ప్రమోద్ రావు,ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ డెడ్ తో బాలింత మృతి

**అవయవదానంతో నలుగురికి పునర్జన్మ!**
**అవయవాలను దానం చేసిన కుటుంబం అభినందించిన జీవన్దాన్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు.**

అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి 26
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జనకాపూర్ గ్రామంలో విషాదం మధ్య మానవత్వం వెలుగులు విరజిమ్మిన ఘటన చోటుచేసుకుంది. బ్రెయిన్ డెడ్ అయిన ఈస్త సృజన(34) అవయవాలను దానం చేసి నలుగురికి కొత్త జీవితం ప్రసాదించిన కుటుంబం ఆదర్శంగా నిలిచింది.
జిల్లాలోని సబ్‌జైలు సమీప జనకాపూర్ గ్రామానికి చెందిన గుండు నాగరాజుకు, మందమర్రి ప్రాంతానికి చెందిన సృజనతో 2018లో వివాహం జరిగింది. వీరికి ఇప్పటికే ఒక కుమారుడు ఉన్నాడు. ఉద్యోగరీత్యా దుబాయ్‌లో నివసిస్తూ భార్యాభర్తలు మూడేళ్లు కలిసి జీవనం సాగించారు. ఇటీవల సృజన గర్భవతి కావడంతో ప్రసవం కోసం అత్తగారిల్లు అయిన మందమర్రికి తీసుకొచ్చారు. 23 రోజుల క్రితం సృజన మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. కుమారుడు పుట్టిన సందర్భంగా దుబాయ్ నుంచి వచ్చిన నాగరాజు 11 రోజుల పాటు కుటుంబంతో గడిపి తిరిగి ఉద్యోగానికి వెళ్లారు.

**కుప్పకూలి.. బ్రెయిన్ డెడ్ తో మృతి...**
అయితే ఈనెల 21న తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న సృజన అకస్మాత్తుగా తలనొప్పి ఉందని చెప్పి స్పృహ కోల్పోయింది. వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల పాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు.

**మరణిస్తూ నలుగురికి ప్రాణం పోస్తూ...**
ఈ నేపథ్యంలో వైద్యులు, జీవన్ ధాన్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. విషయం తెలుసుకున్న భర్త నాగరాజు దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, భార్య అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. దీంతో సదరు ఆసుపత్రి వైద్యులు సృజన రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులను సేకరించి అవసరమైన రోగులకు మార్పిడి చేశారు. ఆమె అవయవాలు పలువురికి ప్రాణాధారంగా మారాయి. అవయవదానం అనంతరం సృజన పార్థివదేహానికి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది గౌరవ సెల్యూట్ చేసి నివాళు లర్పించడం హృదయాలను కదిలించింది.

**కన్నీరుమున్నీరైన గ్రామం...**
గురువారం సాయంత్రం జనకాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి చితికి ఏమి తెలియని ఐదేళ్ల చిన్నారి కుమారుడు పెద్దల సహాయంతో నిప్పంటించగా గ్రామమంతా కన్నీరుమున్నీరైంది. విషాదాన్ని తట్టుకుని సమాజహితాన్ని ముందుంచి అవయవదానానికి ముందుకొచ్చిన సృజన కుటుంబ సభ్యులను జీవంధాన్ ప్రతినిధులతో పాటు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, భీష్మాచారి, కేవెస్ వాసు, రాంరెడ్డి తదితరులు అభినందించారు.



సృజన (ఫైల్ ఫోటో)



తల్లి అంతిమ యాత్రలో కుండ పట్టిన ఐదేళ్ల కొడుకు

# ఘనంగా మాజీ మేయర్ అమర్ సింగ్ జన్మదిన వేడుకలు




అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి: ఫిబ్రవరి 26,
పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్ పుట్టినరోజు వేడుకలు గురువారం నాడు బుద్ధ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా అభిమానులు, రాజకీయ నాయకులు మరియు కార్యకర్తల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. భారీ సంఖ్యలో చేరుకున్న అనుచరులు, మాజీ కార్పొరేటర్లు స్థానిక నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యకర్తల కోలాహలం మధ్య అమర్ సింగ్ కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.
ఆడంబరాలకు దూరంగా, సేవే లక్ష్యంగా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.సామాజిక కార్యక్రమాలను అభిమానులు చేపట్టారు.పీర్జాదిగూడ అభివృద్ధిలో భాగస్వామిని కావడం తన అదృష్టమని, రాబోయే రోజుల్లో కూడా ప్రజల పక్షాన ఉండి పోరాడుతానని అమర్ సింగ్ ఈ సందర్భంగా తెలిపారు.వివిధ విభాగాల నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో యువజన విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదనపు కోర్టు కోసం హైకోర్టు న్యాయమూర్తిని కలసిన మెట్ పల్లి బార్ అసోసియేషన్ ప్ర తినిధులు



అక్షర వేదం/కోరుట్ల ఫిబ్రవరి 26:
మెట్ పల్లిలో అదనపు కోర్టు మం జూరి చేయాలని కోరుతూ, గురు వారం మెట్ పల్లి బార్ అసోసియే షన్ ప్రతినిధులు హైకోర్టు న్యాయ మూర్తి యార రేణుక మరియు హై కోర్టు రిజిస్ట్రార్ జనరల్ యస్. గో వర్ధన్ రెడ్డి లని కలిసారు. ప్రస్తుతం ఉన్న మెట్ పల్లి కోర్టులో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం అదనపు కోర్టు అవసరం ఉందని జిల్లా పోర్ట్ పోలియో జడ్జికి మరి యు రిజిస్ట్రార్ జనరల్ కి వినతి పత్రం అందించినట్టు అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి తెలిపారు.అ దనపు కోర్టుల ఏర్పాటు కోసం ప్ర భుత్వం కూడా సిద్ధంగా ఉందని , మీ డిమాండ్ ని ప్రభుత్వం దృష్టి లో పెడతామని వారు హామీ ఇచ్చి నట్టు మోహన్ రెడ్డి తెలిపారు. ఆ యన వెంట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీని వాస్, హైకోర్టు న్యాయవాది అ ల్లూరి దివాకర్ రెడ్డి ఉన్నారు.

# విద్యార్థి దశలో చదువుతోపాటు క్రమశిక్షణ క్రీడా స్పూర్తి ,వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరం





**పదవ తరగతి విద్యార్థులకు భవిష్యత్తు చదువుల్లో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు**
**టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు**

అక్షర వేదం/కాటారం, ఫిబ్రవరి 26:
కాటారం మండలం కేంద్రంలోని గారేపల్లి లోనీ వివేకానంద హై స్కూల్ లో నిర్వహించిన ఫేర్వెల్ పార్టీ , వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో దుద్దిళ్ళ శ్రీను బాబు పాల్గొనడం జరిగింది.కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు నిర్వహించిన మార్చ్ పాస్ట్‌కు ఆయన సెల్యూట్ స్వీకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత ముఖ్యమైనది క్రమశిక్షణతో పాటు క్రీడాస్ఫూర్తి కూడా వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఫేర్వెల్ పార్టీ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు భవిష్యత్తు చదువుల్లో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 20వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



అక్షర వేదం/కోరుట్ల ఫిబ్రవరి 26:
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్ట ణంలోని 20వ వార్డులో మున్సి పల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వ హించారు. ఈ సందర్భంగా ము న్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వార్డు లోని పలు కాలనీల్లో మురికి కా లువలను శుభ్రం చేశారు. మురు గు కాలువల్లో పేరుకుపోయిన చె త్తాచెదారం తొలగించారు. రహ దారులను శుభ్రం చేయించారు. పారిశు ద్ధ్య పనులను 20 వ వార్డు కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ పర్య వేక్షణ చేశారు. వార్డును పరిశు భ్రంగా ఉంచడానికి నిరంతరం అవసరమైన కృషి చేస్తామని పే ర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



అక్షర వేదం, మంచిర్యాల, ఫిబ్రవరి 26
రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, మంచిర్యాల పట్టణం లోని పలు పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది బందోబస్త్, పెట్రోలింగ్ చేస్తూ పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసిపి ఆరు ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**చెన్నూరు పట్టణ సీఐ బాన్సిలాల్, ఎస్సై శ్యామ్ పటేల్**




**అక్షర వేదం, చెన్నూరు, ఫిబ్రవరి 27**
మంచిర్యాల జిల్లా చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 02-03-2026 సోమవారం రోజున మైనార్టీ ఫంక్షన్ హాల్ వద్ద జరగబోయే ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం వాల్పోస్టర్ ఆవిష్కరించిన చెన్నూరు పట్టణ సీఐ బాన్సిలాల్, ఎస్సై శ్యామ్ పటేల్ పాల్గొనడం జరిగింది.వాల్ పోస్టర్ ఆవిష్కరించిన చెన్నూర్ పట్టణ సీఐ బాన్సిలాల్, ఎస్సై శ్యామ్ పటేల్, అనంతరం చెన్నూరు పట్టణంలో మైనార్టీ ఫంక్షన్ హాల్ మార్చి 2వ తారీకు సోమవారం రోజున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెన్నూరు పట్టణ సిఐ ఎస్సై పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ జాడి తిరుపతి , కార్యదర్శి లయన్ సౌడం శ్రీనివాస్, , లయన్ జక్కుల సత్యనారాయణ, లయన్ సౌడం సంతోష్, లయన్ ఎన్నం సతీష్, లయన్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# కూలి రేటు పై అవగాహన కల్పిస్తున్న జైపూర్ ఎంపీడీవో



**అక్షర వేదం, జైపూర్, ఫిబ్రవరి 26**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని ఎల్కంటి గ్రామపంచాయతీ లో జరుగుచున్న ఫార్మషన్ రోడ్ పనిని ఎంపీడీఓ జి. సత్యనారాయణ పరిశీలించి, నోటిఫిడ్ వేజ్ రేట్ రూపాయలు 307/-కూలి రేటు పడుటకు చేయవలసిన మీస్రు?మెంట్ పైన అవగాహన కల్పించడం జరిగింది.తర్వాత గ్రామపంచాయతీ లో ప్రగతిలో ఉన్న, ఐననుగురేషన్ కు సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించి వెంటనే మిగిలిన పనులు పూర్తి చేయాలని లబ్దిదారులకు సూచించడం జరిగింది.అనంతరం ఎంపీపీస్ స్కూల్, డ్రింకింగ్ వాటర్ పరిశీలించి వాటర్ కొరత లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి ని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డ్స్ తనిఖీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడెల్లి శ్రీనివాస్ రెడ్డి ,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ,ఏపీ ఓ, ఏఫ్ ఏ, మేట్స్ వేతన కూలీలు పాల్గొన్నారు.

# పలు వివాహాలకు హాజరైన మాజీ మంత్రి



**అక్షర వేదం /వనపర్తి :**
గోపాల్ పెట్ మండలం,పద్మావతి గార్డెన్స్ లో జరిగిన రంగాపురం వాస్తవ్యులు సుంకరగట్టయ వారి కుమార్తె భవ్యశ్రీ- తరుణ్ ల వివాహానికి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళు ్ళ సుఖ:సంతోషాలతో నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీస్సులు అందజేసి మరియు పెద్దమందడి మండలం చెన్నకేశవ గార్డెన్స్ లో జరిగిన కుడుకుంట్ల రవి కవిత దంపతుల కుమారుడు హర్షవర్ధన్ పుష్పా ల వివాహానికి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళ్ళు సుఖ:సంతోషాలతో నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీస్సులు అందజేసి మరియు పెద్దమందడి మండలం, మోజర్ల గ్రామానికి చెందిన భానుప్రకాష్- స్వాతిల వివాహానికి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళ్ళు సుఖ:సంతోషాలతో నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీస్సులు అంద జేసిన మాజీ మంత్రి
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్లను పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య,ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**ఉమ్మడి వరంగల్ ఫిబ్రవరి 26 అక్షర వేదం**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోనిపాలకుర్తి మండల కేంద్రంలోని మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించిన కంప్యూటర్లను స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి , వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల లను బలవపేతం చేయాలనే లక్ష్యం తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను ప్రారంభించామని, పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ సౌకర్యాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యను బలోపేతం చేసినప్పుడే ప్రభుత్వాలు మరింత బలపడతాయని స్పష్టం చేశారు. డిజిటల్ యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అత్యంత అవసరమని, గ్రామీణ ప్రాంతాల పిల్లలకు కూడా ఆధునిక సాంకేతిక విద్య అందుబాటులోకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలలకు కంప్యూటర్లు అందించడం అభినందనీయమని, దీనివల్ల విద్యార్థుల్లో కంప్యూటర్ నైపుణ్యాలు పెరిగి భవిష్యత్తులో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ అభివృద్ధి పనులు చేపట్టిన ఇన్ఫోసిస్ యాజమాన్యాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ సౌకర్యాల విస్తరణకు కృషి చేస్తోందని, ప్రతి పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, ఇన్ఫోసిస్ ప్రతినిధులు మరియు మండల కేంద్రంలోని పలు పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లిలో ప్రపంచ బౌద్ధ ధమ్మ శాంతి పాదయాత్రకు ఘన స్వాగతం







**బుద్ధుని, అంబేద్కర్ కు బౌద్ధ భిక్షువుల పూల వందనం**

**450 కిలోమీటర్ల సుదీర్ఘ యాత్రలో పాల్గొనుటున్న వివిధ దేశాల భిక్షువులు, అంబేద్కరిస్టులు**

**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 26 అక్షర వేదం**
ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేపట్టిన ప్రపంచ బౌద్ధ (ధమ్మ) శాంతి పాదయాత్ర గురువారం కొండమల్లేపల్లికి చేరుకుంది. గురువారం ఉదయం చింతపల్లి నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర మధ్యాహ్న సమయానికి కొండమల్లేపల్లికి చేరుకోగా, స్థానిక ప్రజలు మరియు బౌద్ధానురక్తులు పాదయాత్రకు అత్యంత ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో బుద్ధుడి చిత్రానికి మరియు భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వివిధ దేశాల నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో పూల వందనం సమర్పించారు. ముందుగా స్థానిక సాలిడారిటీ స్కూల్ (Solidarity School) లో కొద్దిసేపు పానీయాలకోసం సేదతీరి వారు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బౌద్ధ భిక్షువులు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బౌద్ధ ధమ్మం కేవలం ఒక మతం కాదని, అది ఆధునిక ప్రపంచానికి అత్యవసరమైన గొప్ప తత్వమని పేర్కొన్నారు. అణు యుద్ధాల భయం, ఆర్థిక అసమానతలు, జాతి-వర్గ వివక్షలతో నలిగిపోతున్న నేటి ప్రపంచానికి బుద్ధుని దర్శనమే స్థిరమైన ఆధారమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాడే గుర్తించారని వారు గుర్తుచేశారు. బుద్ధుని ఆలోచనలు కేవలం వ్యక్తిగత నైతికతకే పరిమితం కాకుండా, సామాజిక న్యాయం మరియు అంతర్జాతీయ శాంతిని స్థాపించే శక్తి కలిగినవని కొనియాడారు.కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా బౌద్ధ క్షేత్రం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర, తెలంగాణలోని ప్రసిద్ధ నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రం వరకు సుమారు 450 కిలోమీటర్ల మేర సాగుతోంది. ఈ చారిత్రాత్మక యాత్రలో వివిధ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో పాటు వందలాది మంది బౌద్ధులు, అంబేద్కరిస్టులు మరియు బహుజనవాదులు ఉత్సాహంగా పాల్గొని ప్రపంచ శాంతికి తమ మద్దతు తెలిపారు. శాంతి సందేశంతో సాగుతున్న ఈ పాదయాత్రను విజయవంతం చేసిన మండల ప్రజలకు, సాలిడారిటీ స్కూల్ యాజమాన్యానికి నిర్వాహకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ



కార్యక్రమం లో యేకుల సురేష్, బోయిని చంద్రమౌళి, నూనె సురేష్, యేకుల అంబేద్కర్, బయ్య శ్రీను, మురళి, జిల్లా రాములు, చెన్నకేశవులు , బార్పాటి వెంకటయ్య తదితరులు వారికి ఘన స్వాగతం పలికిన వారికి మద్దతుగా వారితో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

# అక్రిడిటేషన్ కార్డులపై హైకోర్టు విచారణ

**ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగింపు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 అక్షర వేదం**
తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన జీఓ నంబర్ 252, సవరించిన జీఓ 103పై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని స్పష్టం చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన హైకోర్టు, జర్నలిస్టుల వృత్తి హక్కులు, సదుపాయాల పరిరక్షణ అంశాలను పరిశీలించింది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. జీఓ 252 మరియు సవరించిన జీఓ 103 అమలుతో జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వం తరఫున వాదిస్తూ, జర్నలిస్టుల పనితీరుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా అక్రిడిటేషన్ కార్డుల గడువును పొడిగిస్తున్నట్లు కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే జీఓ 252, జీఓ 103 సవరణలపై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర




ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక సదుపాయాలను ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగించుకునే అవకాశం లభించింది. ఇదిలా ఉండగా, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ కోర్టు నిర్ణయాన్ని స్వాగతించారు. ఇది జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట మాత్రమేనని, జీఓల సవరణలపై పూర్తి న్యాయం సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.